# రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ

## తెలంగాణ, హైదరాబాదు

## "నాణ్యమైన విద్య - ఉపాధ్యాయుల నాణ్యత మరియు బోధనాభ్యసనల పరిస్థితి" గురించి అధ్యయన కార్యక్రమం

తేది. 04.08.2014 నుండి 08.08.2014 వరకు

---

# నివేదిక

బడి ఈడు పిల్లలందరూ బళ్ళలో చేరడం, వారందరూ నాణ్యమైన విద్యను పొందడం ఆర్.టి.ఇ-2009 చట్ట ప్రకారం ప్రాథమిక హక్కుగా మారింది. నాణ్యమైన విద్య నాణ్యమైన ఉపాధ్యాయులపైన, వారు నిర్వహించే నాణ్యమైన బోధనాభ్యసన ప్రక్రియలపైన ఆధారపడి ఉంటుంది. పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర, వారు సంసిద్ధులు కావడం, వారికున్న విషయ పరిజ్ఞానం గురించి, నూతన పాఠ్యపుస్తకాల వినియోగం గురించి అధ్యయనం చేయాలని విద్యాశాఖ సంకల్పించింది. ఇందుకోసం పాఠ్యపుస్తక రచయితలు, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థలోని పాఠ్యపుస్తక విభాగం సభ్యులు తేది. 04.08.2014 నుండి 08.08.2014 వరకు అధ్యయన కార్యక్రమం చేపట్టారు. వీరితోపాటు జిల్లా ఉప విద్యాధికారులు కూడా పాల్గొన్నారు.

**అధ్యయనం జరిపిన జిల్లాలు:** రంగారెడ్డి, హైదరాబాదు, మెదక్, మహబూబ్‌నగర్, నల్లగొండ.

**అధ్యయనంలో ఉపయోగించిన సాధనాలు:** ఉపాధ్యాయుల ప్రశ్నావళి, తరగతిగది పరిశీలనలు, పిల్లల ప్రశ్నావళి, ప్రధానోపాధ్యాయుల ప్రశ్నావళి, ఆధారాల పరిశీలన (సంబంధిత రికార్డులు, రిజిష్టర్లు, వస్తు సామగ్రి మొ॥వి పరిశీలించడం).

**అధ్యయన బృందాలు:** ఒక్కొక్క సబ్జక్టులో ఉప విద్యాధికారితోపాటు సబ్జక్టు కోఆర్డినేటర్, ముగ్గురు పాఠ్యపుస్తక రచయితలతో బృందాలను ఏర్పరచారు. వీరు రెండు గ్రూపులుగా విడిపోయి రోజుకు రెండు పాఠశాలల చొప్పున సందర్శించి అధ్యయనం చేపట్టారు.

**అధ్యయనం చేసిన పాఠశాలలు:** ఒక్కొక్క సబ్జక్టులో 16 పాఠశాలల చొప్పున 100 ఉన్నత పాఠశాలల్లో అధ్యయనం చేపట్టారు.

**ఉపాధ్యాయుల సంఖ్య:** ఒక్కొక్క సబ్జక్టులో 25 మంది చొప్పున మొత్తం 150 మంది ఉపాధ్యాయులపైన అధ్యయనం చేశారు.

**విద్యార్థుల సంఖ్య:** సగటున ఒక్కొక్క సబ్జక్టులో సుమారు 1000 మంది విద్యార్థులతో ముఖాముఖి చర్చ ద్వారా అధ్యయనం చేపట్టారు.

## అధ్యయన అంశాలు

**ఎ. ఉపాధ్యాయులు:**

1. పాఠ్యపుస్తకాల గురించి ఉపాధ్యాయులకున్న అవగాహన.
2. సబ్జక్టు వారీగా నిర్ధారించిన సామర్థ్యాల గురించి అవగాహన.
3. ఉపాధ్యాయుల తయారీ, బోధనకు సిద్ధం కావడం, ప్రణాళికలు రూపొందించడం.
4. నిరంతర సమగ్ర మూల్యాంకనం, పరీక్షల సంస్కరణలను అమలు చేయడం.
5. ఉపాధ్యాయులకున్న విషయ పరిజ్ఞానం.
6. ఉపాధ్యాయుల అభిప్రాయాలు.

**బి. పిల్లల స్థాయి**

1. తెలుగు భాషలో చదవడం–రాయడం చేయగలగడం.
2. ఆంగ్ల భాషలో చదవడం–రాయడం చేయగలగడం.
3. గణితంలో పిల్లలు చతుర్విధ ప్రక్రియలు చేయగలగడం.

**సి. తరగతిగది పరిశీలన (బోధనాభ్యసన ప్రక్రియల పరిశీలన)**

1. సబ్జక్టువారీగా నిర్ధారించిన సోపానాల ప్రకారం బోధించడం.
2. పాఠ్యపుస్తకాలను సక్రమంగా వినియోగించడం.
3. బోధనలో బోధనాభ్యసన సామగ్రి (టి.ఎల్.ఎం)ని వినియోగించడం.
4. విద్యార్థుల భాగస్వామ్యం.
5. ఎంత సమయం దేనికి వినియోగించారు? (బోధనాసమయం సద్వినియోగం)
6. పిల్లల స్థాయి ప్రకారం బోధన.
7. పిల్లల అవగాహనను పరిశీలించడం.

**డి. పిల్లల అభిప్రాయాలు**

1. పాఠ్యపుస్తకాల గురించి
2. ఉపాధ్యాయులు, బోధన గురించి
3. అభ్యాసాలలోని ప్రశ్నలకు సమాధానాలు రాయడం గురించి
4. పిల్లల నోటుబుక్కుల పరిశీలన
5. వనరుల వినియోగం (గ్రంథాలయం, ప్రయోగశాలలు మొ॥వి)

**ఇ. ప్రధానోపాధ్యాయులు:**

1. బోధనా బాధ్యతలు
2. ప్రణాళికలు రూపొందించడం, అమలుపరచడం
3. అకడమిక్ మానిటరింగ్
4. ఉపాధ్యాయులతో సమీక్షలు
5. లక్ష్యాలను ఏర్పరచుకోవడం, సాధన కోసం కృషి చేయడం
6. సి.సి.ఇ, పరీక్షల సంస్కరణలను అమలుపరచడం

## ముఖ్యమైన పరిశీలనలు

**ఎ. ఉపాధ్యాయులు:**

1. పాఠ్యపుస్తకాల గురించి ఉపాధ్యాయులకున్న అవగాహన.
   - మన రాష్ట్రంలో 2011 నుండి నూతన పాఠ్యపుస్తకాలు అమలులోకి వచ్చాయి. ఈ సంవత్సరం 10వ తరగతి నూతన పాఠ్యపుస్తకాలు వినియోగిస్తున్నారు. పాఠ్యపుస్తకాల గురించి సరైన అవగాహన కల్పించడానికి ముందుమాటను, ఉపాధ్యాయులకు సూచనలను, పాఠ్యపుస్తకం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలను పాఠ్యపుస్తకాలలో చేర్చారు. అయితే, వీటిని చదివి అర్థం చేసుకున్నవారు కేవలం 20% మంది మాత్రమే ఉన్నారు. మిగతావారు పాఠ్యపుస్తకం గురించి ఎలాంటి అవగాహన లేకుండానే యాంత్రికంగా వినియోగిస్తున్నారు.
   - గత పాఠ్యపుస్తకాలకు, ప్రస్తుతం ఉన్న నూతన పాఠ్యపుస్తకాలకు మధ్య తేడాలను కూడా సగం మంది ఉపాధ్యాయులు చెప్పలేకపోయారు.
   - పాఠ్యపుస్తకాలలోని పాఠాల నేపథ్యం, ఇతివృత్తాలను కేవలం 30% మంది మాత్రమే చెప్పగలిగారు.
   - ఒక పాఠంలోని విషయం అమరిక గురించి కేవలం 15% మంది మాత్రమే సరిగా చెప్పగలిగారు.
   - ఒక పాఠంలోని విషయాన్ని, పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాల గురించి ఇచ్చిన అభ్యాసాలను నిర్వహించడానికి పీరియడ్లు కేటాయించినా వీటి గురించి సరిగా స్పందించలేకపోయారు. అనగా ఏ పీరియడ్‌లో ఏమి బోధించాలో తెలిసిన వారు కేవలం 20% మంది మాత్రమే ఉన్నారు.
2. సబ్జక్టు వారీగా నిర్ధారించిన సామర్థ్యాల గురించి అవగాహన.
   - ప్రతి సబ్జక్టులో సాధించాల్సిన సామర్థ్యాలను నిర్ధారించి, వీటికి అనుగుణంగా నూతన పాఠ్యపుస్తకాలను రూపొందించారు. ఏ సబ్జక్టు బోధించే ఉపాధ్యాయుడైనా వీటిని దృష్టిలో పెట్టుకొని పాఠ్య బోధన చేయాలి.

- ప్రతి పాఠ్యపుస్తకంలో కూడా సామర్థ్యాల వివరాలను, ప్రతి పాఠంలో వీటికి సంబంధించిన అభ్యాసాలను పొందుపరచారు. అయితే, సబ్జక్టు వారీగా ఉన్న సామర్థ్యాలను గురించి పాక్షికంగా చెప్పగలిగిన వారు కేవలం 30% మంది మాత్రమే ఉన్నారు. వీటిలో పూర్తిగా అన్ని సామర్థ్యాలు చెప్పినవారు 20% మంది మాత్రమే. మిగతావారు సామర్థ్యాలేమిటో అసలే చెప్పలేకపోయారు.
- సామర్థ్యాలపై అవగాహన లేకుండానే యాంత్రికంగా విషయాన్ని బోధించడానికి పరిమితం అవుతున్నారు. దీనివల్ల పిల్లల్లో సామర్థ్యాల సాధన జరగడం లేదు.

3. ఉపాధ్యాయుల తయారీ, బోధనకు సిద్ధం కావడం, ప్రణాళికలు రూపొందించడం.

- నాణ్యమైన బోధన జరగాలంటే ఉపాధ్యాయులు ముందుగానే ప్రణాళికలు రూపొందించుకోవాలి. బోధించే విషయంపట్ల అవగాహన పెంచుకోవాలి. అవసరమైన అదనపు సమాచారాన్ని సేకరించుకోవాలి. పిల్లలను భాగస్వాములను చేసేలా కృత్యాలను, ప్రాజెక్టు పనులను, అన్వేషణలను మొదలగువాటిని రూపొందించుకోవాలి. ఇందుకనుగుణంగా ఉపాధ్యాయులందరూ వార్షిక, పాఠ్య ప్రణాళికలను రూపొందించుకోవాలి. వీటి గురించి గత రెండు సంవత్సరాలుగా శిక్షణలు ఇచ్చినప్పటికీ, జనవరి 2014 మాసంలో, జూన్ 2014 మాసంలో ఉపాధ్యాయులకు టెలికాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అయినా ప్రణాళికలు రూపొందించుకొని, వాటి ప్రకారం బోధించేవారు అతి తక్కువ మంది ఉన్నారు.
- దాదాపుగా 90% మంది ప్రణాళికలు రూపొందించకుండానే బోధిస్తున్నారు. మిగతా 10% మంది ప్రణాళికలు రూపొందించినా ఇవి అసంపూర్తిగా ఉన్నాయి. మరి కొంతమంది ఈ ప్రణాళికలను కూడా మార్కెట్లో లభించే ఉపాధ్యాయ కరదీపికలను చూసి రాశారు.
- ఉపాధ్యాయులు తాము రూపొందించుకున్న ప్రణాళికల ప్రకారం బోధన జరపడం లేదు. వీటిని అధికారుల కోసమో లేదా ఎవరైనా సందర్శకులు పరిశీలిస్తారనే ఉద్దేశంతో మాత్రమే రాస్తున్నట్లుగా అనిపించింది.
- ఉపాధ్యాయుల్లో అధ్యయనం, సంసిద్ధులు కావడం అనే వృత్తిపరమైన దృక్పథం క్రమేణా కనుమరుగైనట్లుగా సంస్కృతి చోటుచేసుకున్నది. ప్రణాళికలను సంస్కరించి, సరళీకృతం చేసినప్పటికీ కూడా రాసేవారి సంఖ్య నామమాత్రంగా ఉండడం నాణ్యమైన విద్యను అందించడాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

4. నిరంతర సమగ్ర మూల్యాంకనం, పరీక్షల సంస్కరణలను అమలు చేయడం.

- పిల్లలు తాము పొందిన జ్ఞానాన్ని దైనందిన జీవితంలోగాని లేదా తదుపరి అభ్యసనంలోగాని ఏ మేరకు వినియోగిస్తున్నారో తెలుసుకోవడానికి తదనుగుణంగా చర్యలు చేపట్టడానికి నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని అమలుపరచాలని ఆర్.టి.ఇ-2009 పేర్కొన్నది. ఇందుకనుగుణంగా

మన రాష్ట్రంలో నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని (సి.సి.ఇ) గత రెండు సంవత్సరాలుగా అమలుపరుస్తున్నారు. వీటి గురించి ఇప్పటికే ఉపాధ్యాయులందరికి అవగాహన సదస్సులను, శిక్షణా కార్యక్రమాలను పలుమార్లు నిర్వహించారు. అయినప్పటికీ వీటి అమలుతీరు పూర్తిస్థాయిలో జరగడం లేదు.

- సి.సి.ఇ. ని పాక్షికంగా 35% మంది పాఠశాలల్లో అమలుపరుస్తున్నారు. అమలుపరుస్తున్న పాఠశాలల్లో కూడా నివేదికలు సరిగా లేవు.
- గత సంవత్సరం కొన్ని పాఠశాలల్లో సి.సి.ఇ. లోని నిర్మాణాత్మక మూల్యాంకనాన్ని అమలు చేయకుండానే నివేదికలు సమర్పించారు.
- ప్రాజెక్టుపనులను, రాతపనులను మాత్రమే కొంతమేరకు అమలుపరచారు. రాతపనులు అనగా పాఠ్యపుస్తకాల్లోని ప్రశ్నలకు పిల్లలు సొంతంగా జవాబులు రాయాలి. వీటిని పరిశీలించి మార్కులను కేటాయించాలి. అయితే, సుమారు అన్ని పాఠశాలల్లో పిల్లలు గైళ్ళను చూసి జవాబులు రాశారు. అయినప్పటికీ కూడా వీటిని పట్టించుకోలేదు. గతంలో నిర్వహించినట్లుగానే లఘు పరీక్ష (స్లిప్‌టెస్ట్)ను యూనిట్ టెస్ట్ మాదిరిగా నిర్వహించారు.
- సంగ్రహణాత్మక మూల్యాంకనానికి రాజీవ్ విద్యా మిషన్ ద్వారా ప్రశ్నాపత్రాలు సరఫరా చేసినందున అన్ని పాఠశాలల్లో నిర్వహించారు. అయితే, జవాబుపత్రాలను 85% పాఠశాల్లో మాత్రమే సరిగా దిద్దారు. మార్కులను కేటాయించడంలో సరైన ప్రమాణాలను పాటించలేదు. పిల్లలు నామమాత్రంగా, అర్థరహితంగా జవాబులు రాసినప్పటికిని కూడా మార్కులు కేటాయించారు. ఒకటి రెండు పాఠశాలల్లో జవాబుపత్రాలను దిద్దకుండానే మార్కులు వేసి నివేదికలు సమర్పించారు.
- పరీక్షల నిర్వహణ, పిల్లలను మూల్యాంకనం చేయడమనేది ఒక యాంత్రిక తంతుగా మారింది. వీటి వల్ల పిల్లలు ఏమి నేర్చుకున్నారు? ఎలా నేర్చుకున్నారు? వెనుకబాటుతనంలో ఉంటే ఎలాంటి సహాయం అందించాలి? అనే విషయాలు ఎక్కడా చోటుచేసుకోలేదు.

5. ఉపాధ్యాయులకున్న విషయ పరిజ్ఞానం.

- ఉపాధ్యాయుల నాణ్యతలో అతి ముఖ్యమైనది వారికున్న విషయ పరిజ్ఞానం. అయితే, దురదృష్టవశాత్తు ఉపాధ్యాయుల విషయ పరిజ్ఞానంలో తీవ్రమైన వైఫల్యాలను గమనించడం జరిగింది.
- ఉపాధ్యాయుల ప్రశ్నావళిలో ఆయా సబ్జక్టులకు సంబంధించిన విషయపరమైన ప్రశ్నలను కూడా చేర్చారు. వీటికి కేవలం 30% మంది మాత్రమే సరైన సమాధానాలు ఇవ్వగలిగారు.

50% మంది నామమాత్రంగా అసంపూర్తిగా సమాధానాలిచ్చారు. మిగతా 20% మంది అసలు ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం రాయలేదు. ఉదాహరణకు పూర్తయిన పాఠంలోని పద్యానికి భావం రాయడం, సూక్తులు, నినాదాలు రాయడం, అలంకారాన్ని గుర్తించడం, వచన కవితలోని పాదాలను ఏ పాఠంలోవో గుర్తించి వివరణ రాయడం వంటి అంశాలకు జవాబులు రాయడంలో భాషోపాధ్యాయులు విఫలమైనారు. అట్లే, సాంఘికశాస్త్రంలో భారతదేశ పటంలో ముఖ్య పట్టణాలను గుర్తించమంటే.. పూర్తిగా సరిగా గుర్తించినవారు కేవలం 10% మంది, పాక్షికంగా అనగా కొన్ని పట్టణాలను మాత్రమే గుర్తించిన వారు 20% మంది ఉన్నారు. మిగతావారు కేవలం 1, 2 పట్టణాలను మాత్రమే గుర్తించగలిగారు. ఇదే పరిస్థితి సామాన్యశాస్త్రంలో, గణితంలో కూడా ఎదురైంది.

- గతంలో ఉపాధ్యాయులకు విషయపరమైన పరిజ్ఞానం అధికంగా ఉండేది. ప్రస్తుతం విషయపరమైన పరిజ్ఞానం నామమాత్రంగా ఉండటం ఆందోళన కలిగించే అంశం. అప్పటికప్పుడే పుస్తకం తెరచి చదివించడం లేదా చదవడం చేయడం, ప్రశ్న జవాబులను గైళ్ళలో చూసి రాసుకోమనడం వంటివి ఈ పరిస్థితులకు కారణమవుతున్నాయి. విషయాన్ని చదవడం, అర్థం చేసుకోవడం వాటి గురించి ఆలోచింపజేసే ప్రశ్నలు అడగడం, పిల్లల సందేహాలను ముందుగానే ఊహించి సిద్ధం కావడం వంటివి కనుమరుగైనాయి. వీటి వల్ల ఉపాధ్యాయుల నాణ్యత ప్రశ్నార్థమైనది.

6. ఉపాధ్యాయుల అభిప్రాయాలు.

- నూతన పాఠ్యపుస్తకాల గురించి, పరీక్షల సంస్కరణల గురించి ఉపాధ్యాయులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించారు. పాఠ్య పుస్తకాలు బాగున్నాయని, పిల్లల్ని ఆలోచింపజేయడానికి తోడ్పడతాయని, సామర్థ్యాల సాధనకు అనుగుణంగా అభ్యాసాలను పొందుపరచారని తెలియజేశారు. బహుళ చిత్రాలతో ఆకర్షణీయంగా ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, వీటిపట్ల శిక్షణ అవసరమని తెలియజేశారు.
- నూతన పాఠ్యపుస్తకాల్లోని విషయాల గురించి, పరీక్షల సంస్కరణల గురించి మరింత అవగాహన కల్పించాలని కోరారు.
- పాఠశాలలను నిరంతరం మానిటరింగ్ చేయాలని, విద్యాపరమైన సలహాలు, సూచనలు అందజేయాలని తెలియజేశారు.
- ప్రాథమిక స్థాయి పూర్తయ్యేసరికి పిల్లలందరూ చదవడం-రాయడం, చతుర్విధ ప్రక్రియలు చేయగలగితే అలాంటి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించగలమని పేర్కొన్నారు.

**బి. పిల్లల స్థాయి:**

1. తెలుగు భాషలో చదవడం-రాయడం చేయగలగడం.
   - 6 నుండి 10వ తరగతి వరకు చదివే పిల్లల్లో తెలుగులో చదివి అర్థం చేసుకోగలిగిన వారు కేవలం 55% మంది ఉన్నారు.
   - తమకు తెలిసినదాని గురించి సొంతమాటల్లో రాయగలిగిన వారు 50% మంది ఉన్నారు.
   - అయితే, 10వ తరగతిలో చదవడం-రాయడం కూడా చేయలేనివారు సుమారు 30% మంది ఉన్నారు.
2. ఆంగ్ల భాషలో చదవడం-రాయడం చేయగలగడం.
   - 6 నుండి 10వ తరగతి వరకు చదివే పిల్లల్లో ఆంగ్లంలో చదివి అర్థం చేసుకోగలిగిన వారు కేవలం 40% మంది ఉన్నారు.
   - తమకు తెలిసినదాని గురించి సొంతమాటల్లో రాయగలిగిన వారు 20% మంది ఉన్నారు.
   - అయితే, 10వ తరగతిలో చదవడం-రాయడం కూడా చేయలేనివారు సుమారు 20% మంది ఉన్నారు.
3. గణితంలో పిల్లలు చతుర్విధ ప్రక్రియలు చేయగలగడం.
   - గణితంలో కూడా చతుర్విధ ప్రక్రియలు చేయగలిగిన వారు 50% మంది మాత్రమే ఉన్నారు.
   - అయితే, 10వ తరగతిలో కూడా 30% మంది పిల్లలు చతుర్విధ ప్రక్రియలు చేయలేకున్నారు.

**సి. తరగతిగది పరిశీలన (బోధనాభ్యసన ప్రక్రియల పరిశీలన):**

1. సబ్జక్టువారీగా నిర్ధారించిన సోపానాల ప్రకారం బోధించడం.
   - ప్రతి సబ్జక్టులో ఆ సబ్జక్టు స్వభావాన్నిబట్టి బోధనా సోపానాలను నిర్ధారించారు. వీటికనుగుణంగా పాఠ్యపుస్తకాలను రూపొందించారు. భాషా వాచకాల్లో ప్రతి పాఠం కూడా ఉన్ముఖీకరణ, పాఠ్యాంశ వివరాలు, పఠన కృత్యాలు, పాఠ్యాంశం, సామర్థ్యాల వారీగా అభ్యాసాలను పొందుపరచారు. అట్లే విజ్ఞానశాస్త్రం, సాంఘికశాస్త్రాల్లో పిల్లలను పాఠ్యాంశంవైపు ఆలోచింపజేయడానికి దైనందిన జీవిత సంఘటనలు, చిత్రాలు, ఆలోచింపజేసే ప్రశ్నలు మొదలగువాటితో పాఠాలు ప్రారంభమవుతున్నాయి. వివిధ భావనలను అవగాహన కల్పించడానికి కృత్యాలు, సమాచార పట్టికలు, ప్రక్రియా చిత్రాలు పొందుపరచారు. వీటికి సంబంధించిన వివరణలు చేర్చారు. వీటి ఆధారంగా పిల్లలను చర్చింపజేయడానికి అనుగుణంగా మధ్యమధ్యలో బాక్సుల్లో ప్రశ్నలు ఇవ్వడం జరిగింది. అదనపు సమాచారం తెలియజేయడానికి బాక్సుల్లో ఇచ్చారు. పాఠం చివర కీలకాంశాలను, ముఖ్యాంశాలను పొందుపరచారు. ఆ తరవాత ' మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి' అనే పేరుతో సామర్థ్యాలతో కూడిన అభ్యాసాలను పొందుపరచారు.

- గణితంలో పూర్వ భావనలతో కూడిన వివరణలను, ప్రశ్నలను, సంఘటనలను, సన్నివేశాలను, చిత్రాలతో పాఠాలు ప్రారంభమయ్యాయి. వివిధ గణిత భావనలను పరిచయం చేసిన తరవాత వాటి అవగాహనను పిల్లలు పొందడానికి 'ఇవి చేయండి' అనే పేరుతో అభ్యాసాలు, సామర్థ్యాల స్థాయిని పెంచి పిల్లలకు అభ్యాసం కల్పించడానికి 'ప్రయత్నించండి' పేరుతో అభ్యాసాలను చేర్చారు. వీటిని చేయగలిగిన పిల్లలు సొంతంగా చేయడానికి తమ అవగాహనను పరీక్షించుకోవడానికి అభ్యాసాలను ఇచ్చారు.
- అయితే, ఈ క్రమంలో పద్ధతి ప్రకారం అనగా సోపానాల ప్రకారం బోధనను నిర్వహించేవారు కేవలం $15\%$ మంది మాత్రమే ఉన్నారు.
- విషయాన్ని బోధించడానికి ప్రత్యేకమైన పీరియడ్లు, అభ్యాసాలను నిర్వహించడానికి ప్రత్యేకమైన పీరియడ్లు కేటాయించినప్పటికీ కూడా వీటిని పట్టించుకోకుండా నామమాత్రంగా పాఠాలను పూర్తి చేస్తున్నారు.
- అభ్యాసాలలోని ప్రశ్నలకు జవాబులను గైడ్లలో చూసి రాయడాన్ని ప్రోత్సహిస్తున్నారు. దీన్ని ఎవరూ కూడా నిరోధించడం లేదు.
- ఉన్ముఖీకరణ లేదా పునశ్చరణ నిర్వహించడం, మేథోమధనం ద్వారా పిల్లల అవగాహనను తెలుసుకోవడం, భావనలపట్ల అవగాహన పెంపొందించడానికి కృత్యాలను/ ప్రయోగాలను/ జట్టుపనులను నిర్వహించాల్సి ఉండగా ఎక్కడా కూడా వీటిని నిర్వహించడం లేదు.
- సక్సెస్ స్కూళ్ళలో తెలుగుతోపాటు ఆంగ్ల మాధ్యమం కూడా ఉంది. అయితే, $90\%$ పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమం తరగతులను కలిపే తెలుగులో బోధిస్తున్నారు. ఆ తదుపరి గైడ్లలో చూసి పిల్లలు జవాబులు జ్ఞాపకం చేయడం జరుగుతున్నది.

2. పాఠ్యపుస్తకాలను సక్రమంగా వినియోగించడం.

- పాఠ్యపుస్తకాలను చదవడం లేదా చదివించడం, అందులోని వాక్యాలనే తిరిగి వివరించడానికే పాఠ్యపుస్తకాలను వినియోగిస్తున్నారు.
- ఆలోచింపజేసే ప్రశ్నలను అడగడం, బాక్సుల్లో ఇచ్చిన ప్రశ్నల ఆధారంగా చర్చలు నిర్వహించడం జరగడం లేదు.
- ఉపాధ్యాయులకు ఇచ్చిన సూచనల ప్రకారం బోధనాభ్యసన ప్రక్రియలను పాఠ్యపుస్తకం ఆధారంగా నిర్వహించడం లేదు.
- పిల్లలు కూడా పాఠం బోధించే సమయంలో పుస్తకాన్ని కేవలం చూడడం కోసం మాత్రమే ఉపయోగిస్తున్నారు.

- అయితే, ఈ విద్యా సంవత్సరంలో పిల్లలందరి వద్ద పాఠ్యపుస్తకాలు ఉండడం శుభపరిణామం.
- పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్నప్పటికీ సుమారు 1000 నుండి 1500 రూపాయలను వెచ్చించి పిల్లలందరూ గైళ్ళను కొనుక్కోవడం గమనార్హం.

3. బోధనలో బోధనాభ్యసన సామగ్రి (టి.ఎల్.ఎం)ని వినియోగించడం.

- దాదాపుగా ఏ పాఠశాలలో కూడా టి.ఎల్.ఎం. ను బోధనలో వినియోగించడం లేదు.
- సాంఘికశాస్త్రంలో మ్యాప్‌లు, గ్లోబు, అట్లాసు వంటివి అందుబాటులో ఉన్నప్పటికీ వినియోగించడం లేదు. అట్లే పాఠశాలల్లో ప్రయోగశాలలు, సామగ్రి ఉన్నప్పటికీ నామమాత్రంగా వినియోగిస్తున్నారు. భాషలో ఎక్కడా కూడా నిఘంటువులను వాడడం, రెఫరెన్స్ పుస్తకాలను ఉపయోగించడం, గ్రంథాలయ పుస్తకాలు చదవడం కనిపించలేదు.

4. విద్యార్థుల భాగస్వామ్యం.

- పిల్లలందరూ నాణ్యమైన విద్యను పొందడం అనగా బోధిస్తున్న విషయంపట్ల అవగాహన ఏర్పరచుకోవడం, దైనందిన జీవితంలో వినియోగించడం, విశ్లేషించడం, విమర్శనాత్మకంగా ఆలోచించడం, ప్రతిస్పందించడం, సృజనాత్మకంగా ప్రతిపాదనలు చేయడం చేయగలగాలి. ఇందుకోసం వారు బోధనాభ్యసన ప్రక్రియల్లో పాల్గొనాలి. పూర్తిగా భాగస్వాములు కావాలి. చర్చల్లో పాల్గొనడం, జట్టుపనులు చేయడం, తాము చేసిన వాటి గురించి చెప్పడం, ప్రశ్నించడం వంటివి చేయగలగాలి. అప్పుడే నాణ్యమైన విద్యను పొందగలుగుతారు. వీటిని దాదాపుగా ఏ పాఠశాలలో అమలుపరచినట్లుగా అగుపించలేదు.

5. ఎంత సమయం దేనికి వినియోగించారు? (బోధనాసమయం సద్వినియోగం)

- ఒక పీరియడ్ అనగా 45 ని॥ల సమయం. ఈ సమయంలో విద్యార్థుల భాగస్వామ్యం ఎక్కువగా ఉండాలి. ఉపాధ్యాయుల బోధన తక్కువగా ఉండాలి. అయితే, సుమారు అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉపన్యాస పద్ధతిలో వివరించడానికో లేదా పాఠం చదివించి, అవే వాక్యాలను పునరుక్తి చేయడానికే సమయాన్ని వినియోగించారు. పిల్లలను ఆలోచింపజేసే ప్రశ్నలను అడిగి చర్చలను నిర్వహించడానికి బదులు విషయపరమైన ప్రశ్నలనే అడగడం, వాటికి పిల్లలు గుంపుగా జవాబు చెప్పడం చోటుచేసుకుంటున్నది.

6. పిల్లల స్థాయి ప్రకారం బోధన.

- ఏ తరగతిలోనైనా చాలా చురుకైనవారు, మధ్యస్థంగా ఉండేవారు, ప్రాథమిక అవగాహన లేనివారు ఉంటారు. ఉపాధ్యాయులు పిల్లల స్థాయిని దృష్టిలో పెట్టుకొని బోధనాభ్యసన ప్రక్రియలను నిర్వహించాలి. అయితే, సుమారు అన్ని పాఠశాలల్లో చురుకైన పిల్లలను దృష్టిలో పెట్టుకొని బోధన జరుగుతున్నట్లు గమనించడం జరిగింది. వెనుకబడిన పిల్లల గురించి

పట్టించుకోవడం జరగడం లేదు. వీరు విషయపరమైన అవగాహనను పొందకుండానే తరగతుల్లో కొనసాగుతున్నారు. దీనివల్ల వీరికి విషయం కాఠిన్యంగా మారడం, బడి అంటే అనాసక్తి ఏర్పడడం జరుగుతున్నది. తద్వారా బడి నుండి దూరమయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి.

7. పిల్లల అవగాహనను పరిశీలించడం.
   - ఏ పీరియడ్‌లోనైనా సామర్థ్యాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికాబద్ధంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. పీరియడ్ ముగించే ముందు పిల్లల అవగాహనను సామర్థ్యాల ఆధారంగా తెలుసుకుంటారు. అయితే, దాదాపు అన్ని సబ్జక్టులలో సామర్థ్యాల వారీగా పిల్లల అవగాహనను తెలుసుకోవడానికి బదులు యాంత్రికంగా నామమాత్రపు ప్రశ్నలతో ముగిస్తున్నారు. వీటికి కూడా పిల్లలు గుంపుగా సమాధానాలివ్వడం జరుగుతున్నది.

**డి. పిల్లల అభిప్రాయాలు:**

1. పాఠ్యపుస్తకాల గురించి
   - పిల్లలు నూతన పాఠ్యపుస్తకాలను బాగున్నాయని పేర్కొన్నారు. బొమ్మలు, అభ్యాసాలు, ప్రశ్నలు ఆలోచింపజేసేలా ఉన్నాయని 80% మంది పేర్కొన్నారు. అయితే, విద్యార్థులకు సూచనలను కేవలం 30% మంది మాత్రమే చదివినట్లుగా తెలిపారు.
2. ఉపాధ్యాయులు, బోధన గురించి
   - తమ ఉపాధ్యాయులు మంచివారని తెలిపారు. ఎవ్వరూ కూడా ఉపాధ్యాయుల గురించి వ్యతిరేక భావనలు కలిగి లేరు. అయితే, వారు పాఠాలు బోధిస్తున్నప్పుడు పూర్తిస్థాయిలో అర్థం కావడంలేదని సగం మంది విద్యార్థులు చెప్పారు.
   - పాఠం బోధించేటప్పుడు సామగ్రిని ఉపయోగించరని 90% మంది విద్యార్థులు తెలిపారు.
   - పాఠంలోని విషయాన్ని చదవడం, తమతో చదివించడం, వాటిని వివరిస్తారని 90% మంది తెలిపారు.
   - పాఠం మధ్యలో ఇచ్చిన ప్రశ్నలను అడుగుతారని, చర్చ నిర్వహిస్తారని 30% మంది మాత్రమే తెలిపారు.
3. అభ్యాసాలలోని ప్రశ్నలకు సమాధానాలు రాయడం గురించి
   - పాఠాలలోని అభ్యాసాలకు, ప్రశ్నలకు సమాధానాలను 90% మంది పిల్లలు గైడ్లలో చూసి రాస్తామని తెలిపారు. 10% మంది మాత్రమే ఆలోచించి సొంతంగా రాస్తామన్నారు.
   - గైడ్లలో చూసి రాసినప్పటికిని సమాధానాల గురించి పూర్తిగా చెప్పలేమని 70% మంది చెప్పారు.
   - గైడ్లలో చదివిన విషయాలను జ్ఞాపకం చేస్తామని 85% మంది తెలిపారు.

4. పిల్లల నోటుబుక్కుల పరిశీలన

- ఉపాధ్యాయులు తమ నోటుపుస్తకాలను చూసి టిక్ చేస్తారని 80% మంది తెలిపారు. అయితే, వీటిలోని తప్పులను గుర్తించి సవరించేవారు 50% మంది ఉంటారని పిల్లలు తెలిపారు.
- అభ్యాసాలకు జవాబులను తప్పుగా రాసినప్పుడు వాటి గురించి తరగతిలో ఉపాధ్యాయులు చర్చ ద్వారా అవగాహన కల్పించడం జరగదని దాదాపు విద్యార్థులందరూ తెలిపారు.

5. వనరుల వినియోగం (గ్రంథాలయం, ప్రయోగశాలలు మొ॥వి)

- పాఠశాలల్లో గ్రంథాలయ పుస్తకాలను అప్పుడప్పుడు చదువుతామని 30% మంది తెలిపారు. అయితే, ఇంగ్లీష్, హిందీ పుస్తకాలు చదవడానికి లేవని 75% మంది తెలిపారు. పాఠశాలలో పుస్తకాలు ఉన్నప్పటికిని ఇవ్వరని 50% విద్యార్థులు అభిప్రాయపడ్డారు.
- ప్రయోగశాలల ద్వారా ప్రయోగాలు చేయడం, సామగ్రిని వాడడం చేయించరని 50% మంది విద్యార్థులు తెలిపారు.
- కేవలం భారతదేశ పటం, ప్రపంచ పటం మాత్రమే చూపారని 50% మంది తెలిపారు. అట్లాస్‌లు ఉన్నప్పటికీ ఉపయోగించాలని తమకు తెలియదని 60% మంది అభిప్రాయపడ్డారు.

**ఇ. ప్రధానోపాధ్యాయులు:**

1. బోధనా బాధ్యతలు

- ప్రధానోపాధ్యాయులు ఏదైనా ఒక సబ్జక్టు పూర్తిగా బోధించాలని ఉన్నప్పటికీ 90% మంది బోధన జరపడం లేదు. మిగతా 10% మంది తమ సబ్జక్టు నేపథ్యంగా అప్పుడప్పుడు పాక్షికంగా తరగతులు నిర్వహిస్తారు. ఈ బాధ్యతలను సంబంధిత సబ్జక్టు ఉపాధ్యాయులే చేపడతారు.
- వ్యాయామ ఉపాధ్యాయులు (పి.ఇ.టి) పదోన్నతులపై ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న చోట పీరియళ్ళను అసలే తీసుకోవడం లేదు. తాము బి.ఎడ్. చేయలేదని, సబ్జక్టులు బోధించలేమని తెలిపారు.

2. ప్రణాళికలు రూపొందించడం, అమలుపరచడం

- బోధిస్తున్న సబ్జక్టుకు వార్షిక, యూనిట్/ పాఠ్య ప్రణాళికలను దాదాపుగా ప్రధానోపాధ్యాయులెవ్వరూ కూడా రూపొందించడం లేదు.
- ఉపాధ్యాయులు రూపొందిస్తున్నప్పటికీ వాటిని పరిశీలించడం, సలహాలు, సూచనలు ఇవ్వడం జరగడం లేదు.
- కార్యాలయం పని, పని ఒత్తిడి, సమావేశాలు వంటి వాటివల్ల తాము బోధనాభ్యసన బాధ్యతలను చేపట్టలేమని తెలిపారు.

3. అకడమిక్ మానిటరింగ్

- ప్రధానోపాధ్యాయుడు పాఠశాలకు ప్రథమ మానిటరింగ్ అధికారి. ఉపాధ్యాయులందరూ సక్రమంగా సరైన రీతిలో బోధించేలా చూడాలి. పిల్లలందరూ నాణ్యమైన విద్యను పొందేలా బాధ్యత వహించాలి. బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహిస్తున్నప్పుడు ఉపాధ్యాయుల తరగతిగది బోధనను పరిశీలించాలి. వారు రాసిన ప్రణాళికలను చూసి, వాటి ప్రకారం బోధిస్తున్నారో లేదో నిర్ధారించాలి. బలహీనతలను గమనించి సలహాలు, సూచనలు ఇవ్వాలి. కానీ దాదాపు ఏ ప్రధానోపాధ్యాయుడు కూడా ఈవిధంగా అకడమిక్ మానిటరింగ్ చేయడం లేదు.
- కొంతమంది ప్రధానోపాధ్యాయులు అకడమిక్ మానిటరింగ్ చేయులేమని, ఇది వివాదాస్పదమవుతుందని తమ నిస్సహాయతను వ్యక్తపరచారు. ఈవిధంగా చేస్తే తాము పని చేయలేమని తమ బలహీనతలను బయటపెట్టారు.
- అకడమిక్ మానిటరింగ్ ఎలా చేయాలో తమకు తెలియదని, సబ్జక్టు వారీగా అవగాహన లేదని 70% మంది అభిప్రాయపడ్డారు.
- తమకు వివిధ సబ్జక్టుల గురించి, పాఠ్యపుస్తకాల గురించి అవగాహన కల్పించాలని కోరారు.
- ఉపాధ్యాయులను తాము ప్రశ్నించలేమని, ఉపాధ్యాయులు తమను ప్రశ్నించరని 30% మంది పేర్కొన్నారు.

4. ఉపాధ్యాయులతో సమీక్షలు

- ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశాలను మాసవారీగా నిర్వహించాలి. ఉపాధ్యాయుల బోధన గురించి, పిల్లల స్థాయి గురించి, వనరుల వినియోగం గురించి సమీక్షించాలి. లక్ష్యాలను నిర్ధారించాలి. అయితే, దాదాపు 70% పాఠశాలలో సమీక్షా సమావేశాలు జరగడం లేదు. మిగతా 30% పాఠశాలల్లో జరుపుతున్నామని చెప్పినప్పటికీ మినిట్స్ పుస్తకాలను నిర్వహించడం లేదు. కేవలం సమావేశం ఉన్నట్లుగా నోటీసు పుస్తకాల్లో వివరాలు ఉన్నాయి.

5. లక్ష్యాలను ఏర్పరచుకోవడం, సాధన కోసం కృషి చేయడం

- ప్రతి ప్రధానోపాధ్యాయుడు తమ పాఠశాలలోని బలాలను, బలహీనతలను బేరీజు వేసుకొని విద్యా సంవత్సరంలో తాము సాధించాలనుకున్న అంశాలను నిర్ధారించుకొని లక్ష్య సాధన కోసం కృషి చేయాలి. అయితే, ఈ దృక్పథం ఆలోచనా ధోరణి దాదాపు ఏ పాఠశాలలో కూడా కనిపించలేదు. ప్రధానోపాధ్యాయులు ఈ కోణంలో ఆలోచించడం లేదు.
- అయితే, ప్రధానోపాధ్యాయులు 90% మంది 10వ తరగతి పరీక్షల గురించి గత సంవత్సరం కంటే అధిక ఫలితాలు సాధించాలని అనుకుంటున్నట్లుగా తెలిపారు.

- తమ పాఠశాలల్లో ఎంతమంది పిల్లలు చదవడం–రాయడం చేయగలరని అడిగినప్పుడు స్పష్టంగా గుర్తించలేకపోయారు. సంబంధిత ఉపాధ్యాయులను అడిగి చెప్పడం జరిగింది.

6. సి.సి.ఇ, పరీక్షల సంస్కరణలను అమలుపరచడం

- గత రెండు సంవత్సరాల నుండి సి.సి.ఇ అమలు జరుగుతున్నప్పటికీ సుమారు 90% మంది ప్రధానోపాధ్యాయులకు అవగాహన లేదు. ప్రధానంగా ఈ విద్యా సంవత్సరం నుండి అమలుచేస్తున్న పరీక్షల సంస్కరణల పట్ల అవగాహన కొరవడింది. ఏ పాఠశాలలో కూడా జులై నాటికి పూర్తి కావల్సిన నిర్మాణాత్మక మూల్యాంకనాన్ని పూర్తి చేయలేదు. దీని గురించి ప్రధానోపాధ్యాయులను ప్రశ్నించగా చేస్తున్నామని మాత్రమే చెప్పారు.

7. ప్రధానోపాధ్యాయుల అభిప్రాయాలు

- ప్రాథమిక స్థాయిలో ఆంగ్ల మాధ్యమాలను ప్రారంభించాలి.
- 5వ తరగతి పూర్తయ్యేసరికి చదవడం–రాయడం చేయగలిగేలా ప్రాథమిక పాఠశాలలు బాధ్యత వహించేలా చూడాలి.
- ఆంగ్ల మాధ్యమానికి ప్రత్యేకంగా ఉపాధ్యాయులను ఆంగ్ల మాధ్యమంలో చదివిన వారిని నియమించాలి.
- పాఠశాలల్లోని ఖాళీలను భర్తీ చేయాలి.
- ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాల గురించి, పరీక్షల సంస్కరణల గురించి ముఖాముఖి శిక్షణలను నిర్వహించాలి.
- అదనపు తరగతిగదులను అవసరమైన చోట నిర్మించాలి.
- ప్రాజెక్టుపనులకు సమయం సరిపోవడం లేదు. ఉపాధ్యాయులకు వెసులుబాటు కల్పించాలి.
- సహపాఠ్య కార్యక్రమాల గురించి ఎలాంటి అవగాహన లేదు. సామగ్రి లేదు. వీటిని అందించి శిక్షణలివ్వాలి.
- సైన్స్, ఆంగ్లం సబ్జక్టులకు పీరియళ్ళు సరిపోవడం లేదు.
- పాఠశాలలను తప్పనిసరిగా అధికారులు సందర్శించాలి. విషయపరమైన సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు ఇవ్వాలి.

## ఓవరాల్ ఒపీనియన్స్

- నాణ్యమైన విద్య ప్రధానంగా నాలుగు అంశాలతో ముడిపడి ఉంటుంది. అవి: 1) ఉపాధ్యాయుల నాణ్యత 2) నాణ్యమైన బోధన 3) వనరుల సద్వినియోగం 4) లక్ష్య సాధన గురించి మానిటరింగ్, సమీక్షలు. అయితే, ఈ నాలుగు అంశాలు కూడా పాఠశాల విద్యలో బలహీనమైన అంశాలుగా

మారాయి.

- ఉపాధ్యాయులు విషయపరమైన పరిజ్ఞానంతోపాటు బోధనా నైపుణ్యాలను కలిగి ఉండాలి. ఇవి నేడు ప్రశ్నార్థకంగా మారాయి. గతంతో పోలిస్తే ఉపాధ్యాయుల విషయ పరిజ్ఞానం అంతంతమాత్రమే అని చెప్పవచ్చు.
- గత దశాబ్ద కాలంగా పాఠశాల మానిటరింగ్ అతి బలహీనంగా మారింది. అడిగేవాళ్ళు లేకపోవడం వల్ల జవాబుదారీతనం కూడా సన్నగిల్లింది. ఇది ఫలితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది.
- పాఠశాలలకు గతంతో పోలిస్తే ఆర్థిక వనరులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయి. అట్లే ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, సామగ్రి వంటివి అందుబాటులో ఉన్నప్పటికినీ వీటిని అవసరం మేరకు వినియోగించడం లేదు. వీటి ఆవశ్యకతను, ఉనికిని కూడా గుర్తించడం లేదు.
- ఏమి బోధించాలి? ఎలా బోధించాలి? ఎందుకు బోధించాలి? ఈ మూడు ఉపాధ్యాయులకు అతిముఖ్యమైన అంశాలు. దురదృష్టవశాత్తు ఎలా బోధించాలి? ఎందుకు బోధించాలి? అనే విషయంపట్ల అవగాహన కొరవడింది. ఏ సబ్జక్టు అయినా ఎందుకు బోధిస్తున్నారనే ఆలోచన లేకుండానే యాంత్రికంగా పాఠాలను పూర్తి చేస్తున్నారు.
- పాఠశాలల్లో పనితీరు ఎవరికి వారే యమునాతీరు అన్నట్లుగా ఉన్నది. ఉపాధ్యాయులపైన ప్రధానోపాధ్యాయులకు నియంత్రణ కొరవడింది. ప్రధానోపాధ్యాయుల గురించి ఉపాధ్యాయులు పట్టించుకోరు. ఎవరికి వారే రాజీ ధోరణితో సర్దుకొనిపోతున్నారు. పిల్లల గురించి ఆలోచించడం తగ్గింది.
- సాధారణ జనం నమ్మకాలకు అనుగుణంగా పాఠశాలలు పనిచేయడం లేదు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నాయి.
- ప్రభుత్వ పాఠశాలల్లో 'పిల్లలను ఎందుకు చేర్చడం లేదని తల్లిదండ్రులతో మాట్లాడితే, వారు ఎందుకు చేర్చాలని తిరిగి ప్రశ్నిస్తున్నారు'. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నప్పటికీ తమ పిల్లలకు చదువే ముఖ్యమని తల్లిదండ్రులు భావిస్తున్నారు.
- ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలు పేద వర్గాలకు చెందినవారని ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు సరఫరా చేస్తున్నది. అయితే, తల్లిదండ్రులు తమ పిల్లలకు వేలాది రూపాయలు వెచ్చించి అదే పిల్లలకు స్టడీమెటీరియళ్ళు, గైళ్ళను కొనుగోలు చేసి ఇస్తున్నారు. తమ పిల్లల చదువుల కోసం త్యాగాలు చేయడానికి సైతం వెనకాడడం లేదు.
- ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎప్పుడు వస్తారో? ఎప్పుడు పోతారో? తెలియదని, వచ్చినా పాఠాలు అర్థమయ్యేలా చెప్పరని తల్లిదండ్రులు భావిస్తున్నారు.
- ప్రధానోపాధ్యాయుడు ఎప్పుడు సమావేశాలకు లేదా పై అధికారులను కలవడానికి వెళ్తుంటాడని,

దీని వల్ల ఉపాధ్యాయులను పట్టించుకునేవారు ఉండరని తల్లిదండ్రులు, పిల్లలు భావిస్తున్నారు.

- గతంలో గ్రామంలోని అన్ని వర్గాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకే వచ్చేవారు. దీనివల్ల ఉపాధ్యాయులు ఆ సమాజంలోని విభిన్న వర్గాలకు జవాబుదారీతనం వహించి బాధ్యతగా వ్యవహరించేవారు. ప్రస్తుతం అట్టడుగు, అణగారిన వర్గాల పిల్లలు మాత్రమే ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్నారు. వీరి తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులతో మాట్లాడడానికి ముందుకురారు. దీనివల్ల క్రమేణా ఈ పాఠశాలలు సమాజం నుంచి దూరమయ్యాయి.
- కౌన్సెలింగ్ పద్ధతి రాకముందు ఉపాధ్యాయులపైన స్థానిక ప్రజాప్రతినిధుల అజమాయిషీ ఉండేది. దీనివల్ల ఉపాధ్యాయులు కొంత బాధ్యతగా వ్యవహరించారు. నేడు స్థానిక ప్రజాప్రతినిధులు కూడా గ్రామాల్లో ఉండకపోవడం, వారు తమ పిల్లలను ఇతర పాఠశాలల్లో చదివించడం, కౌన్సెలింగ్ పద్ధతిలో బదిలీలు, పోస్టింగ్‌లు వంటివి నిర్వహించడంలో తమ పాత్ర పరిమితం కావడం వల్ల ప్రభుత్వ పాఠశాలల గురించి స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం మానివేశారు. ఈ పరిస్థితి కూడా పాఠశాల పనితీరును తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది.
- ఈ వ్యవస్థలో పిల్లల చదువు తప్ప మిగతావన్నీ అతి ముఖ్యమైన కార్యక్రమాలుగా మారాయి. పాఠశాలల పనితీరు పూర్తిగా యాంత్రికంగా ఉంది. ఎవరు ఎవరికి? దేనికి బాధ్యత వహిస్తున్నారో చెప్పడం కష్టం.
- ఉపాధ్యాయులు మొదలుకొని అధికారుల వరకు అందరూ ఖాళీ లేకుండానే ఉంటున్నారు. కానీ ఫలితాలు మాత్రం అంతంత మాత్రంగానే వస్తున్నాయి.
- పాఠశాలల్లో నాణ్యమైన విద్య (క్వాలిటీ)పై దృష్టి పెట్టడం తగ్గింది. దీని గురించి ఎక్కడ కూడా చర్చకు రావడం లేదు.
- పిల్లలు నేర్చుకోలేరనే భావన గట్టిగా ఉంది. నేర్పినా రాదు, వారు ఎలా రాస్తారో అనే తప్పుడు వైఖరులు నెలకొన్నాయి.
- గత మూడు సంవత్సరాలుగా నూతన పాఠ్యపుస్తకాలు వినియోగంలోకి వచ్చినా ఇప్పటికీ అవగాహన అంతంత మాత్రమే. ఇటు అధికారులతోపాటు ఉపాధ్యాయులదీ అదే పరిస్థితి.
- పాఠశాల విద్యలో ఒక్క 10వ తరగతికి మాత్రమే ప్రాధాన్యత సంతరించుకున్నది. పరీక్షల సంస్కరణల వల్ల పిల్లల స్థాయిని అర్థం చేసుకోవడం ప్రారంభమైంది. ఆలోచించి పిల్లలు సొంతంగా జవాబు రాయాల్సి ఉంటుందని గ్రహించడం వల్ల పిల్లల స్థాయి గురించి ఆందోళన ప్రారంభమైంది. కాబట్టి పిల్లలు చదవడం-రాయడం చేయలేనివారు ఉన్నారు. వీరు ఎలా ఉత్తీర్ణులవుతారని అడుగుతున్నారు.

- సి.సి.ఇ. గత రెండు సంవత్సరాలుగా అమలు జరుగుతున్నప్పటికీ నిర్మాణాత్మక మూల్యాంకనం పూర్తి స్థాయిలో అమలు జరగడం లేదు. లఘుపరీక్షను యూనిట్ టెస్ట్ మాదిరిగా నిర్వహిస్తున్నారు. పిల్లలు రాసిన అంశాల్లో సొంతంగా జవాబులు రాయాల్సి ఉండగా గైడ్లలో చూసి జవాబులు రాసేలా ప్రోత్సహిస్తున్నారు.
- సంగ్రహణాత్మక మూల్యాంకనం ప్రశ్నాపత్రాలు సరఫరా చేస్తున్నారు కాబట్టి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే పరీక్షలు నిర్వహించిన జవాబుపత్రాలను సరిగ్గా దిద్దడం లేదు.
- పాఠశాలలో విద్యా వాతావరణం కనుమరుగైంది. పాఠశాల ఆవరణ కూడా ఆకర్షించేవిధంగా లేదు. ఉపాధ్యాయులు తరగతిగదిలో ఉండడం, పాఠ్యాంశాల గురించి చర్చలు నిర్వహించడం, బోధనాభ్యసన కృత్యాలు నిర్వహించడం వంటివి కనిపించడం లేదు. పచ్చదనం, పరిశుభ్రత, నామమాత్రంగా ఉంటున్నాయి. పిల్లల రణగొణ ధ్వనులు, ఉపాధ్యాయులు ఆఫీస్ రూముల్లో ఉండడం, ఒక తరగతిగదిలో ఇద్దరు ముగ్గురు టీచర్లు ఉండడం, ఎవ్వరు వచ్చినా పట్టించుకోకపోవడం కనిపిస్తుంది. ఈ వాతావరణం సమాజానికి ప్రభుత్వ పాఠశాలల పట్ల తప్పుడు సంకేతాలను పంపుతున్నాయి.
- ప్రైవేట్ టీచర్స్ ట్రైనింగ్ కాలేజీల నుండి శిక్షణార్థులు వచ్చిన పాఠశాలల్లో వారి స్థితి ఇంకా గందరగోళంగా ఉంది. వారికే క్లాసులు కేటాయిస్తారు. ఉపాధ్యాయులు ఇక్కడ దాదాపుగా విశ్రాంతి తీసుకుంటారు. కొన్ని సందర్భాల్లో పాఠశాలలకు రాకపోవడం కూడా కనబడింది. వీరికి 6 నుండి 9 తరగతులు అప్పజెప్పి 10వ తరగతికి మాత్రం రెగ్యులర్ ఉపాధ్యాయులు తీసుకోవాలనే నిర్ణయించుకున్నప్పటికీ ఆ తరగతుల్లో కూడా వీరు కనబడరు.
- బోధనాభ్యసన ప్రక్రియలు ఐదు దశాబ్దాల క్రితం ఎలా ఉన్నాయో ఇప్పుడూ అలానే ఉన్నాయి. లేదా ఇంకా దిగజారాయి. ఆధునిక వనరులు, సౌకర్యాలు ఉన్నప్పటికీ వాటిని ఉపయోగించుకునే వైఖరి కనిపంచదు. పాఠశాలల్లో సుమారుగా 15 కంప్యూటర్లతో కూడిన ల్యాబ్, జనరేటర్, డిష్ వంటివి ఉన్నప్పటికీ అవి దుమ్ముకొట్టుకొనిపోయి వాడని స్థితిలో ఉన్నాయి. వాటిని ఉపయోగించాలనే ఆలోచన కూడా వారిలో లేదు.
- పిల్లలు సొంతంగా రాయాలి, ఆలోచించాలి అనే అంశాలను అడగకుంటే ఇంకా దశాబ్దాల తరబడి ఈ వ్యవస్థ ఇలానే కొనసాగుతుంది. అందరూ ఎవరికి వారే రాజీ ధోరణిని వ్యవహరిస్తారు.
- పాఠశాలల పనితీరు, ఫలితాలను పట్టించుకునేవారే కరువయ్యారు. అకడమిక్ మానిటరింగ్ లేదు.
- బడికి పోవడం, చదువు చెప్పడం, పిల్లల్ని పరీక్షించడం వెనుకబాటుతనం ఉంటే సరిదిద్దడం, సహాయం చేయడం ఇవి ఏ వ్యవస్థలోనైనా ఉపాధ్యాయుల నైతిక బాధ్యతలు. దురదృష్టవశాత్తు వీటిని కూడా నిర్వహించడం గగనమైతున్నది. ఈ ప్రాథమిక పనులను నిర్ధారించేవారు కరువయ్యారు.

- చేస్తున్న వృత్తి పట్ల ఉపాధ్యాయులలో సంతృప్తి కనిపించలేదు. చదువుకుంటున్న పిల్లల్లో సంతృప్తి కనిపించలేదు. అధికారులు, తల్లిదండ్రులు.. ఇలా ప్రతి ఒక్క వర్గంలో కూడా అసంతృప్తి నెలకొన్నది.
- 'కప్పదాటు ధోరణి' తప్పులను ఇతరులపై నెట్టివేసే మనస్తత్వం నెలకొన్నది. అది ఇవ్వలేదు.. ఇది చేయలేదు.. ఇది చేయలేదు కావున మాకు తెలియదు.. అవగాహన లేదు.. అనే ధోరణితో వ్యవహరిస్తున్నారు.
- 'బడి మనది', దీని కోసం మనం కృషి చేద్దామనే సమష్టి భావన, దీని గురించి ఆలోచించడం, కలిసి నిర్ణయాలు తీసుకోవడం, వాటిని అమలుపరచడం వంటి పని సంస్కృతి కనుమరుగైంది.
- ఉపాధ్యాయ వృత్తి నిత్య నూతనమైనది. అధ్యయనం చేయడం దీనికి ఉండాల్సిన ముఖ్యమైన లక్షణం. కానీ దురదృష్టవశాత్తు అధ్యయన సంస్కృతి ఉపాధ్యాయులతో మొదలుకొని పైవర్గాల్లో కూడా లోపించడం గమనార్హం.
- వృత్తిలో చేరిన ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా వైఖరులు నెలకొనేటట్లుగా ఆధునిక విధానాల్లో శిక్షణ ఇవ్వాల్సిన విధంగా ఉపాధ్యాయ విద్యాసంస్థలు పనితీరు ప్రశ్నార్థంగానే ఉన్నది.

## చేపట్టాల్సిన చర్యలు

- కొన్ని కఠిన నిర్ణయాలు, సంస్కరణలు అవసరం. అవగాహన పెంపొదించడం అవసరం. రాజీలేని సూత్రాలు నిర్ణయించుకొని వాటిని ఆచరించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా కృషి చేయడం అవసరం. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో జరగాల్సిన పునర్నిర్మాణం చదువుతోనే ప్రారంభం కావాలి.
- ఉపాధ్యాయుల్లో వైఖరి నిర్మాణానికి అవసరమైన తక్షణ చర్యలు చేపట్టాలి. పిల్లల గురించి, బడి గురించి, పిల్లలు నేర్చుకునే విధానాల గురించి, తాము బోధించే సబ్జక్టుకు సంబంధించిన స్వభావం గురించి వైఖరులలో మార్పులు రావాలి. మేము నేర్చుకున్నవిధంగానే బోధిస్తామనే బూజు భావజాలానికి స్వస్తిపలికేలా చర్యలు చేపట్టాలి.
- ఉపాధ్యాయ విద్యను అనగా వృత్యంతర, వృత్తిపూర్వక శిక్షణలను పూర్తిగా సంస్కరించాలి.
- ఆర్.టి.ఇ.-2009 ప్రకారం ఉపాధ్యాయుల బాధ్యతలు, విధి నిర్వహణలను పరిశీలించడానికి వీలుగా మానిటరింగ్ వ్యవస్థను పూర్తిగా సంస్కరించాలి.
- పాఠశాల విద్యలో అందరికి పనితీరు సూచికలు (పర్‌ఫార్మెన్స్ ఇండికేటర్స్) నిర్ణయించాలి. అవి అమలుజరిగేలా చూడాలి.
- పనితీరు సూచికల ఆధారంగా ఉపాధ్యాయుల పనితీరును అంచనా వేయడం, పిల్లల ప్రగతి వివరాలను తెలుసుకొని తగిన చర్యలు చేపట్టడం కోసం ఆన్‌లైన్ మానిటరింగ్ విధానాన్ని అమలుపరచాలి. వీటి ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి తక్షణ చర్యలను చేపట్టాలి.

- ఉపాధ్యాయులకు విషయం గురించి, సోపానాల ప్రకారం బోధించడం గురించి శిక్షణ ఇవ్వాలి. దీన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ సూచనలు చేస్తుండాలి.
- అకడమిక్ మానిటరింగ్ పెంపొందించడానికి విద్యాశాఖలోని అధికారులందరికి రాష్ట్ర విద్యా ప్రణాళికాపరిధి పత్రం–2011, విద్యా ప్రమాణాలు, పాఠ్యపుస్తకాలు, బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ, నిరంతర సమగ్ర మూల్యాంకనం, పరీక్షల సంస్కరణల గురించి అవగాహన కల్పించాలి. ఇందుకోసం వారికి శిక్షణలు నిర్వహించాలి.
- ప్రతి మాసం సబ్జక్టువారీ సమావేశాలు ఏర్పాటు చేసి వృత్తిపరమైన నైపుణ్యాలు వృద్ధి జరగడానికి వీలుగా కృషి చేయాలి.
- కమ్యూనిటీకి పాఠశాలల గురించి, వాటి ద్వారా పిల్లలకు రావల్సిన అంశాల గురించి అర్థం చేయించాలి. వారు తమ పిల్లల గురించి ఉపాధ్యాయులతో చర్చించేలా చర్యలు చేపట్టాలి.
- ప్రభుత్వ పాఠశాలల ముఖచిత్రం మారేలా ప్రధానోపాధ్యాయులను బాధ్యులను చేయాలి.
- అదనపు బాధ్యతలు తొలగించి ప్రధానోపాధ్యాయుడికి బోధనా బాధ్యతలు చేపట్టేలా చర్యలు చేపట్టాలి.
- ఉప విద్యాధికారుల పర్యవేక్షణ కూడా నామమాత్రంగా మారింది. వీరు తప్పనిసరిగా పాఠశాలలను విషయనిపుణుల సహకారంతో సందర్శించి ఉపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేయాలి.
- స్థానిక అవసరాలకు అనుగుణంగా నాణ్యత వృద్ధి చెందేలా ఉప విద్యాధికారులు విద్యా సంవత్సరానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. దాన్ని అమలుపరచాలి. బాధ్యులను చేయాలి.
- ప్రస్తుతం ఉన్న నిరంతరం సమగ్ర మూల్యాంకనం, పాఠ్యపుస్తకాలను అమలుపరచడానికి పనిగంటలు, పనివేళలు సవరించాల్సిన అవసరం ఉంది.
- సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, రిసోర్సెస్, వసతుల విషయంలో రాజీలేకుండా తగిన చర్యలు చేపట్టాలి.
- ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల నుండి శిక్షణ గురించి వచ్చే పాఠశాలల్లోని ఉపాధ్యాయుల గురించి ఆలోచించాలి. వారు వెళ్ళే ఏ పాఠశాలలో కూడా ఉపాధ్యాయులు బోధించడం లేదు. వీరు అందుబాటులో ఉన్న రోజులన్నీ పనితీరు పూర్తిగా దెబ్బతింటున్నది.
- పదోన్నతుల గురించి కొంత పునరాలోచించాలి. డిపార్ట్‌మెంటల్ పరీక్షలను ఇందుకనుగుణంగా సంస్కరించాల్సి ఉంది.